సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024




మళ్లీ జగనన్న పాలనే

ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులే విజయం సాధించి మళ్లీ జగనన్న పాలనే వస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. టెక్కలిలో సోమవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. - 8లో



నగదు, మద్యం స్వాధీనం

ఎన్నికల కోడ్ ఉల్లంఘనులపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. - 8లో



న్యూస్‌రీల్

జవహర్ నవోదయ ఫలితాలు విడుదల

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకు 80 మంది విద్యార్థులను తాత్కాలికంగా ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అప్లికేషన్, హాల్‌టికెట్, 3 నుంచి 5వ తరగతి వరకు చదివిన స్కూల్లో హెచ్ఎం సంతకంతో కూడిన స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఆధార్‌కార్డు తదితర పత్రాలతో జవహర్ నవోదయ విద్యాలయం కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈగా బెనహర్

అరసవల్లి: గ్రామీణ మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) పర్యవేక్షక ఇంజినీర్‌గా జాన్ బెనహర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటివరకు ఎస్ఈగా పనిచేసిన శ్రీనివాసప్రసాద్ ఉద్యోగ విరమణ చేయడంతో శ్రీకాకుళం డివిజన్ ఈఈగా పనిచేస్తున్న బెనహర్‌కు ఈ బాధ్యతలను అప్పగించారు.

గ్రామ వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను గ్రామ సచివాలయ కార్యదర్శికి అందిస్తున్న వలంటీర్లు

ఎల్.ఎన్.పేట: మండలంలోని గొట్టిపల్లి గ్రామ సచివాలయం పరిధిలో ఇద్దరు గ్రామ వలంటీర్లు తమ ఉద్యోగాలకు సోమవారం రాజీనామా చేశారు. వలంటీర్లపై టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారానికి నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు శిమ్మ వనిత, వి శివ కుమార్‌లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించేందుకు ప్రజల్లోకి స్వచ్ఛందంగా వెళతామని తెలిపారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను గ్రామ సచివాలయ కార్యదర్శికి అందించారు.

- **నరసన్నపేట:** నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై నిందలు వేస్తూ ఎన్నికల కమిషన్‌కు టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేస్తూ ఇబ్బందులకు గురి చేయడాన్ని నిరసిస్తూ నరసన్నపేట మండలం మాకివలసకు చెందిన 11 మంది వలంటీర్లు రాజీనామాకు సిద్ధమయ్యారు. ఈ మేరకు సోమవారం తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, స్కానర్లను పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. రాజీనామా పత్రాలు ఎంపీడీఓకు అందిస్తామని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని, అందుకు తగ్గ ప్రణాళికను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల నిర్వహణ అధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్, హౌసింగ్ ఓటింగ్ తదితర అంశాలకు సంబంధించి జిల్లాలో చేపడుతున్న ప్రక్రియను వివరించారు. కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్, డీఆర్ఓ ఎం.గణపతిరావు, ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, ఎల్‌డీఎం సూర్యకిరణ్, డ్వామా పి.డి.చిట్టిరాజు, డి.టి.సి. ఇంద్రశేఖర రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం విజయకుమార్, ఎంవీఐ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ మూల్యాంకనం ప్రారంభం



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న డీఈవో, ఏసీ

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, సమీపంలోనే మహాలక్ష్మినగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల కేంద్రాలుగా స్పాట్ వాల్యుయేషన్ మొదలైంది. తొలిరోజు ఏడు సబ్జెక్టుల పేపర్ల మూల్యాంకనం చేపట్టారు. రాష్ట్ర పరిశీలకుడు సమగ్రశిక్ష ప్రాజెక్ట్ స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌డీపీ రమణ హాజరయ్యారు. క్యాంప్ ఆఫీసర్/డీఈవో కె.వెంకటేశ్వరరావు, స్ట్రాంగ్ రూమ్ డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్/ఏసీ లియాకత్ అలీఖాన్, ఉప విద్యాశాఖాధికారులు/డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు ఆర్.విజయకుమారి, నక్క రామకృష్ణ, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. 1210 మంది హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది మూల్యాంకనంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 8 రోజుల్లో స్పాట్ పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టారు.



వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లిలో కరోనాతో మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని అంత్యక్రియలకు మోసుకెళ్తున్న వలంటీర్లు(ఫైల్)



నరసన్నపేట మండలం తామరాపల్లి గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)



పచ్చ బ్యాచ్ ▸ పాపం పండింది!



విపత్తులకు వెరవలేదు.. కరోనా మహమ్మారిని ఖాతరు చేయలేదు. తమకేమైనా ఫర్వాలేదు.. ఆపన్నులకు చేయూత అందాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్న సేవాసైన్యం వారు. గౌరవ వేతనం మాత్రమే తీసుకుంటూ.. సేవా భావంతో ప్రభుత్వ పథకాలు, సేవలను పౌరుల ఇంటి ముంగిటికే చేర్చిన వలంటీర్లపై 'పచ్చ' కన్ను పడింది. అధికార పార్టీకి మంచి పేరు తెస్తున్న వారిపై పచ్చ బ్యాచ్ కక్ష పెంచుకుంది. ఎన్నికల కోడ్ సాకుతో ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేయించి ప్రజలకు వారి సేవలు అందకుండా చేసింది. పచ్చ కూటమి కుతంత్రం కారణంగా అవ్వాతాతలు కష్టంలో పడ్డారు. గత తెలుగుదేశం హయాంలో పింఛను రాళ్ల కోసం పడిన కష్టాలు గుర్తుచేసుకుంటూ ఈ పాపానికి ఒడిగట్టిన వారికి తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెడుతున్నారు.

పింఛన్ల కుట్ర చంద్రబాబుదే..



వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలు ఎంత గౌరవంగా పథకాలు అందుకుంటున్నారో అందరికి తెలుసు. జగన్ అజెండా ప్రజలకు మేలు చేయడమైతే చంద్రబాబు అజెండా దోచుకోవడం. అమరావతి రాజధాని పేరిట మోసం చేశారు. వలంటీర్ల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 70 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నాం. ఇప్పుడు టీడీపీ నిర్వాకంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితర పెన్షన్ లబ్ధిదారులంతా సచివాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి. పెన్షన్లు ఆగడానికి చంద్రబాబే కారణమని సంబంధిత లబ్ధిదారులకు తెలిస్తే టీడీపీ కార్యకర్తలను వెంటబెట్టి కొడతారు. చంద్రబాబుకు ఎన్నికలే తప్ప ప్రజలకు మంచి చేసే ఆలోచన లేదు.

– మంత్రి ధర్మాన ప్రసాదరావు
(బలగలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో)

అసలు రూపం బయటపడింది



గ్రామ, వార్డు వలంటీర్లపై టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులైన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల నిజ స్వరూపం బయటపడింది. ప్రతినెలా ఒకటో తేదీన ఉదయానికే ఇంటికి తెచ్చి పింఛన్లు ఇచ్చిన వలంటీర్లను అడ్డుకోవడం దారుణం. ఇప్పుడు పింఛన్లు తీసుకునేందుకు లబ్ధిదారులు గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి. రేపు వీరిద్దరికీ అధికారం అప్పగిస్తే సంక్షేమ పథకాలనే ఆపేస్తారు. ఇలాంటి వారిని నమ్మి మోసపోవద్దు. సంక్షేమ పథకాలను అడ్డుకోవాలని చూస్తున్న కూటమి అభ్యర్థులకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి.

– రెడ్డి శాంతి, పాతపట్నం ఎమ్మెల్యే
(ఎల్.ఎన్.పేట మండలం ధనుకువాడలో జరిగిన విలేకర్ల సమావేశంలో..)

పేదలంటే చంద్రబాబుకు కక్ష



పేదలు, వారికి అందించే పథకాలపై చంద్రబాబు అండ్ కో కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు కనుసన్నల్లో కొంతమంది అధికారులు, రాజకీయ మేధావులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు. ఎండలు దారుణంగా ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో ఇంటింటికీ వలంటీర్లు వెళ్లి పింఛన్లు అందజేస్తే అవ్వాతాతలు, దివ్యాంగులకు ఎంతో ఊరట కలుగుతుంది. అయితే దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, ఇంటింటికీ వలంటీర్లు వెళ్లి పింఛన్లు అందజేయకుండా అడ్డుకున్నారు. టీడీపీకి ప్రజల ఉసురు తప్పక తగులుతుంది. ఒక్క నాయకుడ్ని ఎదుర్కొనడానికి ఎంతమంది కలిసి కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలి.

– పేరాడ తిలక్, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి
(మందసలో నిర్వహించిన సమావేశంలో)

కక్షలు కనిపింఛెన్

- వలంటీర్లపై కక్ష కట్టిన చంద్రబాబు అండ్ కో
- ఒకటో తేదీన ఇంటికి పింఛను తీసుకొచ్చే వారిని దూరం చేయడంపై లబ్ధిదారుల మండిపాటు
- ఉసురు తప్పదని శాపనార్థాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కరోనా వైరస్ భయపెడుతున్నా.. వరద వణికిస్తున్నా.. ప్రతిపక్షాలు వెక్కిరిస్తున్నా.. వలంటీర్లు వెన్ను చూపలేదు. ఎక్కడా వెనక్కి తగ్గలేదు. కరోనా కష్టకాలంలో అందరూ ఉన్నా ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న వారి వద్దకు వెళ్లి భరోసా కల్పించారు. లక్షలాది మంది ప్రాణాలను కాపాడారు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లారకముందే అవ్వ తాతల ఇంటి తలుపుతట్టి పింఛన్లు అందించారు. అర్హత గల తల్లికి అమ్మఒడి..అక్కా చెల్లెమ్మలకు ఆసరా..చేయూత, నిరుపేదలకు నివాస స్థలం.. పక్కా ఇళ్లు.. విద్యార్థులకు విద్యా దీవెన...ఇలా ఒకటేమిటి సమస్త సంక్షేమ పథకాలను ప్రజల గడప వద్దకే చేర్చుతూ శభాష్ అనిపించుకున్నారు. దేశంలోనే వలంటీర్ల వ్యవస్థను ఆదర్శంగా నిలిపారు. దేశమంతా మెచ్చుకుంటున్న ఈ వ్యవస్థపై పచ్చ పార్టీ జేబు సంస్థ విషం చిమ్మింది. విశాల ప్రయోజనాలు చూడకుండా రాజకీయ లబ్ధి కోసం ప్రజల నుంచి దూరం చేసే కార్యక్రమానికి ఒడిగట్టింది. చంద్రబాబు తన జేబు సంస్థలుగా పనిచేస్తున్న కొందరు వ్యక్తులకు చెందిన ఆర్గనైజేషన్‌తో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయించడంతో వలంటీర్లను ప్రజలకు దూరం చేశారు. వైఎస్సార్‌సీపీకి ఎక్కడ లబ్ధి చేకూరుతుందన్న భయంతో వలంటీర్ల సేవలు అందకుండా వ్యూహాత్మకంగా పావులు కదిపారు. ఫలితంగా వలంటీర్ల సేవలు దూరం కావడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. ఒకటో తేదీన పింఛన్ అందుకోవాల్సిన అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు లబోదిబోమంటున్నారు. ఈ వయసులో తమను ఇబ్బంది పెడుతున్న చంద్రబాబు అండ్‌కోకు తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెడుతున్నారు.

తొలి నుంచి దుష్ప్రచారమే..

తొలి నుంచి వలంటీర్ల వ్యవస్థపై దుష్ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు, తన మిత్రపక్షమైన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు వలంటీర్లపై నోరు పారేసుకుంటున్నారు. ప్రజలకు మంచి సేవలు అందిస్తున్న వలంటీర్లపై విషం కక్కుతూనే ఉన్నారు. లేనిపోని ఆరోపణలు చేసి వలంటీర్ల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీశారు. వారి నుంచి ప్రతిఘటన ఎదురయ్యాక యూటర్న్ తీసుకోవడం, ఆ తర్వాత మళ్లీ నోటికొచ్చినట్టు వాగడం అలవాటుగా చేసుకున్నారు. వలంటీర్లు ఉంటే తమకు ప్రమాదమని భావించి కుట్ర పూరితంగా వ్యవస్థను నిర్వీర్యం చేసే కార్యక్రమాలకు ఒడిగట్టారు. తమ జేబు సంస్థలుగా ఉండే కొందరితో ఏర్పాటైన సంస్థలతో కోర్టులో పిటిషన్లు వేశారు. అక్కడ సానుకూలత లేకపోవడంతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. రాజకీయ కోణంలో వారి సేవలను చూపించి, ఎన్నికలను బూచిగా పెట్టి ప్రజలకు అందించాల్సిన సేవలనుంచి దూరం చేశారు. వీరి నిర్వాకంతో తొలుత పింఛనుదారులు అవస్థలు పడుతున్నారు. ఈ వయసులో మాకీ కన్నీటి కష్టాలెందుకని ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితికి కారకులైన వారిపై మండిపడుతున్నారు.



జిల్లాలో సేవలందిస్తున్న వలంటీర్లు **12,328**

జిల్లాలో మొత్తం పింఛన్ దారులు **3,22,825**



మా దీనస్థితి మీకు పట్టదా..

నా పేరు అన్నెపు శ్రీదేవి. దరివాడ పంచాయతీ ఊడికలపాడు గ్రామం మాది. నాకు రెండు కాళ్లు పనిచేయవు. తండ్రి కూడా లేరు. తల్లి కూలి పనులు చేసుకుంటూ నన్ను పోషిస్తోంది. నా జీవితం ఎలా గడుస్తుందా అని బెంగపడేదాన్ని. నాకు ఆర్థికంగా ఏ ఆధారం లేదు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక నా ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ ప్రతి నెలా అందిస్తున్నారు.

నేను కదలలేని పరిస్థితిలో ఉంటే ఈ నెల వలంటీర్ పింఛన్ ఇచ్చేందుకు రారని చెబుతున్నారు. సచివాలయం వద్దకు నేను వెళ్లి పింఛన్ తీసుకునేందుకు నా ఆరోగ్య పరిస్థితి సహకరించదు.

–అన్నెపు శ్రీదేవి, ఊడికలపాడు, జలుమూరు.

నాలాంటి వృద్ధులకు ఇబ్బంది..



మా వలంటీర్ ప్రతి నెలా ఒకటో తేదీన మా ఇంటికే వచ్చి రూ.3000 అందించేవారు. ఇక వలంటీర్లు పింఛన్ ఇవ్వరని, సచివాలయానికి వెళ్లాలని అంటున్నారు. పింఛన్ అందుకోవడానికి నాలాంటి ముసలివారు కాళ్లు ఈడ్చుకుంటూ.. ఎక్కడికి వెళ్లాలి. మళ్లీ పాత పాలన తీసుకురావద్దు.

– డి.సాయమ్మ, పింఛన్ లబ్ధిదారు, వజ్రపుకొత్తూరు మండలం

కన్నీటి కష్టాలే..



ఏడెనిమిదేళ్లుగా కిడ్నీవ్యాధితో బాధ పడుతున్నాను. పేద కుటుంబం. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. కిడ్నీవ్యాధి చికిత్సకు రూ.లక్షలు ఖర్చవుతోంది. ఈ పరిస్థితి కిడ్నీవ్యాధి పింఛన్ ప్రతి నెలా వలంటీరు ఇంటికే తీసుకువచ్చి ఇస్తున్నారు. పౌష్టికాహారం, పండ్లు, మందులు కొనడానికి ప్రభుత్వం సహకరిస్తోంది. ఇప్పుడు వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వరని అంటున్నారు. అధికారంలోకి రాక ముందే కష్టాలు పెడుతున్న తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మాలాంటి పేదలకు కన్నీటి కష్టాలే. – నర్తు సీతారాం, గొల్లలపాలెం, లోహరిబంద పంచాయతీ, మందస మండలం

మళ్లీ మొదటికే..



గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పింఛన్ కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారం. ఎన్నికలు వస్తుండటంతో చంద్రబాబు పన్నిన పన్నాగంతో మా కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. సీఎం జగన్ అధికారం చేపట్టిన తరువాత వలంటీర్లు ద్వారా ప్రతి నెలా 1వ తేదీన ఉదయం 5 గంటలకే వచ్చి పింఛన్ ఇచ్చేవారు. నేడు చంద్రబాబు చేసిన కుట్ర వల్ల మాలాంటి దివ్యాంగులు సచివాలయాల వద్దకు వెళ్లి క్యూ కట్టాల్సిన పరిస్థితి.

– చింతాడ సూర్యారావు, దివ్యాంగ పింఛన్ లబ్ధిదారుడు, పోలవరం, టెక్కలి మండలం

అభాగ్యులపై ఎందుకంత అక్కసు

మా అబ్బాయి పేరు తొత్తరి రాజు. పుట్టినప్పటి నుంచి రెండు కాళ్లు పనిచేయవు. జగనన్న అధికారంలో వచ్చిన వెంటనే వికలాంగుల కోటా కింద రూ.3 వేలు పింఛన్ మంజూరు చేశారు. అబ్బాయికి వేలిముద్ర పడదు. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ మజ్జి లక్ష్మీ మా ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నారు. ఈ నెల వలంటీర్ ఇంటికి రారని తెలిసింది. నా కుమారుడ్ని బయటకు తీసుకుని వెళ్లే పరిస్థితి లేదు. మాలాంటి అభాగ్యులపై కుట్రలు ఎందుకు.

–తొత్తరి రమణమ్మ, జి.సిగడాం.

వలంటీర్ల సేవల్లో కొన్ని..



- కరోనా మహమ్మారి విజృంభించిన వేళ రిక్షా తొక్కుతూ బ్లీచింగ్ చల్లుతూ పారిశుద్ధ్య కార్మికులుగా అవతారమెత్తారు. శానిటేషన్ సిబ్బంది విధులు నిర్వర్తించడానికి వణికిపోయిన పరిస్థితుల్లో ఆ పనులను భుజానికెత్తుకున్నారు.
- ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే మోటార్ పనిచేయక నీటి సరఫరా నిలిచిపోయి తాగునీటి ఇబ్బందులు ఏర్పడితే వెంటనే ట్రాన్స్‌కో సిబ్బందిని ఊరిలోకి తీసుకొచ్చి సమస్య పరిష్కరించారు.
- గిరిజన గ్రామాల్లో ఆపద వస్తే సరైన మార్గం లేక పట్టించుకోని పరిస్థితుల్లో దగ్గరుండి ఆపదను తీర్చే వారిని తీసుకొచ్చి ఉపశమనం కలిగించారు.
- కరోనా విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారికి అంతిమ సంస్కారాలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోతే వారే ఆ కార్యక్రమం పూర్తి చేసి మానవత్వం చాటుకున్నారు.
- అనారోగ్యంతో విశాఖ, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఆస్పత్రిలో పింఛన్‌దారులు చికిత్స పొందితే అక్కడికెళ్లి ఠంఛన్‌గా పింఛన్లు అందించారు.
- ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలను కాపాడారు.
- ఇంటి స్థలం కోసం అనేకమార్లు గత ప్రభుత్వంలో అర్జీలు పెట్టుకున్నా ఫలితం దక్కని వారి ఇంటికి వచ్చి ఇంటి స్థలానికి దరఖాస్తు చేయించి, అధికారుల చేత మంజూరు చేయించారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

మందస: మండలంలోని కొండలోగాం పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి సోమవారం చేరారు. రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో మోహన్‌కుమార్, కూర్మారావు, చిన్నారావు, రాములు, జగ్గారావు, వెంకటరావు, రవికుమార్, ఉమాశంకర్, కాళిదాసు, అభి, సూర్జన తదితరులు పార్టీలో చేరారు. వీరికి మంత్రి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సవర ఢిల్లేశ్వరరావు, నాగేశ్వర జయరాం పాల్గొన్నారు.

- **కాశీబుగ్గ:** మున్సిపాలిటీలోని తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన 50 మంది యువకులు మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో గణేష్, ఉర్జాన అవినాష్, కుర్మాన శేఖర్, శంబాన మోహన్, చింతల కార్తీక్, చల్ల ధనరాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి బోనెల రాము, జిల్లా అధికార ప్రతినిధి బడగల బల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ డైరెక్టర్ మల్లా రవికుమార్, చాపర సింహాద్రి, కొన్న బైరాగి, కొన్న అప్పలస్వామి, బోనెల అప్పలస్వామి, బోనెల సింహాద్రి, మిరపపల్లి మల్లేష్, బోనెల గణపతి, తలగాన సింహాచలం పాల్గొన్నారు.



మంత్రి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కొండలోగాం గిరిజన యువకులు

- **శ్రీకాకుళం రూరల్:** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో పెదపాడు గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వీరికి మంత్రి ధర్మాన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.



పార్టీలో చేరిన పెదపాడు గ్రామస్తులతో మంత్రి ధర్మాన ప్రసాదరావు

చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాల్లో కోత

- మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: అధికారంలోకి రాక ముందే వలంటీర్లను పక్కన పెట్టిన చంద్రబాబుకు పొరపాటున అధికారం కట్టబెడితే సంక్షేమ పథకాల్లో కోత విధిస్తారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం తండేవలస పంచాయతీ బెండువానిపేటలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు జిల్లాకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అన్ని రంగాలను చంద్రబాబు నాశనం చేస్తే.. జగన్ ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. 75 ఏళ్లలో జరగని అభివృద్ధి ఐదేళ్లలో చేసి చూపించారని చెప్పారు. 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించామన్నారు. చంద్రబాబు అవ్వాతాతల ఇళ్ల వద్దకు వలంటీర్లు వెళ్లకుండా పింఛన్లు ఆపించేశారని, వారి ఉసురు తగులుతుందని చెప్పారు.

- శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ మాట్లాడుతూ చంద్రబాబు వస్తే జన్మభూమి కమిటీలు చుట్టూ తిరగాలని, జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోకి తీసుకొస్తే వలంటీర్లు మన చెంతనే ఉంటూ పథకాలు అందిస్తారని చెప్పారు. చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దని కోరారు. యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంబటి శ్రీనివాసరావు, గొండు కృష్ణమూర్తి, అంబటి నిర్మల, రుప్ప దివ్య, మూకళ్ల తాతబాబు, చిట్టి జనార్దనరావు, అల్లు లక్ష్మినారాయణ, పొన్నాన కూర్మారావు, బెండి సంజీవరావు, చిట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బెండువానిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

క్లుప్తంగా

పింఛన్ల పంపిణీకి ప్రణాళిక



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సమూన్, జేసీ నవీన్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పింఛన్ల పంపిణీకి ప్రణాళిక రూపొందిస్తున్నామని కలెక్టర్ మన్జీర్ జిలానీ సమూన్ తెలిపారు. జిల్లాలో 732 సచివాలయాల ద్వారా ఒక్కొక్క సచివాలయానికి సగటున 456 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందని వివరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకంలో చెరువుల మరమ్మతులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో జేసీ నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, జెడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి బిడ్డకు బ్యాంకు పీఓ కొలువు



జ్యోత్స్నకు స్వీట్ తినిపిస్తున్న తండ్రి ఢిల్లీరావు

కంచిలి: మండలంలోని మకరాంపురం పంచాయతీ సాలినపుట్టుగ గ్రామానికి చెందిన పేదింటి బిడ్డ సాలిన జ్యోత్స్న ఐబీపీఎస్ ఫలితాల్లో సత్తాచాటి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో పీఓగా ఎంపికైంది. ఈమె తండ్రి ఢిల్లీరావు రైతు. తల్లి శేషమ్మ అంగన్‌వాడీ కార్యకర్త. సోదరుడు రాజీవ్ బీటెక్ చదువుతున్నాడు. జ్యోత్స్న బీటెక్ పూర్తి చేశాక పోటీపరీక్షలకు సిద్ధమైంది. ఐబీపీఎస్ రాసి పీఓ కొలువుకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

ఆమదాలవలస రూరల్: మండలంలోని దన్నానపేట సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌కు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు వచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 నుంచి 2027 వరకు ఈ గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్‌బీఏ బృందం కళాశాలను పరిశీలించినట్లు తెలిపారు. కళాశాల ప్రగతి, సాధించిన ఫలితాలు, వసతులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి సంతృప్తి చెందిన బృందం అక్రిడిటేషన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. ఇందుకు సహకరించిన కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ఎస్‌బీటీఈటీ చైర్మన్ నాగమణి, సెక్రటరీ కె.వి.రమణబాబు, డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, జాయింట్ సెక్రటరీ జానకిరామ్, కళాశాల మెకానికల్ విభాగం అధిపతి ఎ.గోపి, ఈసీఈ విభాగ అధిపతి పి.శ్రీనివాస్, అధ్యాపకులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పేడాడ



పేడాడ పరమేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా పేడాడ పరమేశ్వరరావును పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు సోమవారం జాబితా విడుదల చేసింది. ఈయన ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా కొన్నాళ్లు పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. పాత్రికేయునిగా, ప్రజాసంఘాల నాయకునిగా, విద్యావేత్తగా సేవలందించారు. 2007లో ప్రజారాజ్యం పార్టీలో చేరారు. ఆ పార్టీ కాంగ్రెస్ పార్టీలో విలీనమైన తర్వాత కాంగ్రెస్ వాదిగా కొనసాగుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఖగేశ్

మందస: మండలంలోని హరిపురం శివారులో బిన్నళమదనాపురం రహదారి వద్ద ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. హరిపురం గ్రామానికి చెందిన రైస్ మిల్లు యజమాని నల్ల రామారావు మిల్లులో పనులు ముగించుకుని, ఇంటికి స్కూటీలో బయలుదేరారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన వై.మహేశ్, ఖగేశ్, జీవన్ ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తుండగా.. రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రామారావు, ఖగేశ్‌ల కాళ్లు విరిగిపోగా, మరో ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. రామారావును మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. మరో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురిని పలాస సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రచారాల జోష్!



శ్రీకాకుళం పీఎన్ కాలనీ: మంత్రి ధర్మాన ప్రసాదరావుకు తిలకం దిద్దుతున్న మహిళ. చిత్రంలో శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ తదితరులు

ఎన్నికల ప్రచారాలు ఊపందుకుంటున్నాయి. అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లి తమనే గెలిపించాలంటూ విన్నవిస్తున్నారు. ప్రజలకు మేలు చేసిన వారికే పట్టం కట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



కవిటి:కుసుంపురం పంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్



సారవకోట: పురుషోత్తపురం గ్రామంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు హారతులిస్తున్న గిరిజన మహిళలు



రణస్థలం: ఓటర్లకు నమస్కరిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



పాతపట్నం: పాతపట్నం కుమ్మరివీధిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మళ్లీ జగనన్న పాలనే

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కృష్ణదాస్, కాయల వెంకటరెడ్డి
- టెక్కలిలో ఎమ్మెల్యే దువ్వాడ శ్రీనివాస్ ప్రచారం ప్రారంభం



టెక్కలిలో జనంతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, కాయల వెంకటరెడ్డి



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్. చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, కాయల వెంకటరెడ్డి

టెక్కలి: 'ఎన్నికలు వచ్చాయని.. టీడీపీ, జనసేన కలిసి ఎటువంటి కుట్రలకు పాల్పడతారోనని అవ్వా తాతలు, పేద, సామాన్య వర్గాలు భయాందోళన చెందకండి...మీ అందరి ఆశీర్వాదంతో రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనే రానుంది' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సోమవారం టెక్కలిలో ప్రారంభించిన ఎన్నికల ప్రచారానికి అశేషంగా జనాలు తరలివచ్చి సీఎం వైఎస్ జగన్ పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ముందుగా చేరీవీధిలో గల గ్రామదేవత కిల్లి పోలమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. మెయిన్‌రోడ్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ మీదుగా వైఎస్సార్ జంక్షన్ వరకు ఎన్నికల ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పాటలకు మహిళల కోలాటాలు, తప్పెడుగుళ్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద దువ్వాడ శ్రీనివాస్‌తో పాటు కాయల వెంకటరెడ్డికి భారీ గజమాలతో సన్మానించారు. దారి పొడవునా వైఎస్ జగన్ నినాదాలు ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ నినాదాలతో పట్టణం మారుమోగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లి అజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు తమ్మన్నగారి కిరణ్, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంత రెడ్డి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, మహిళా నాయకులు పి.హేమలత, కె.పార్వతి, ఎ.కళ్యాణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పథకాలు ఆపేయాలని అచ్చెన్న ఫిర్యాదు చేశారు..

గ్రామ వలంటీర్లతో సంక్షేమ పథకాల పంపిణీని ఆపేయాలని టీడీపీ నాయకుడు అచ్చెన్నాయుడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ధ్వజమెత్తారు. వాస్తవంగా ఈ నెలలో వలంటీర్లతో పింఛన్ పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ, తక్షణమే ఆపేయాలని అచ్చెన్నాయుడు ఫిర్యాదు చేశారని ఫిర్యాదు పత్రాన్ని చూపించారు. కేవలం రాజకీయమే వ్యాపారంగా కింజరాపు కుటుంబీకులు కోట్లు గడించారని దుయ్యబట్టారు. ఇటువంటి అచ్చెన్నాయుడును తరిమికొట్టాలని దువ్వాడ పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఇక్కడ ఓటమి చెందినప్పటికీ సీఎం వైఎస్ జగన్ ఎంతో మంచి మనసుతో మూలపేట పోర్టుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని దువ్వాడ గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి తనతో పాటు ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని దువ్వాడ శ్రీనివాస్ కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కాయల వెంకటరెడ్డి కోరారు.

విద్యార్థుల ప్రవర్తన గమనించాలి



విద్యాసంస్థల యాజమాన్యాలతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : కళాశాలలు, పాఠశాలలు, వసతి గృహాలకు వచ్చే విద్యార్థుల ప్రవర్తనను సీసీ టీవీ కెమెరాల ద్వారా నిత్యం పర్యవేక్షిస్తుండాలని ఎస్పీ జి.ఆర్.రాధిక విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విద్యార్థుల భద్రత, ఆత్మహత్యల నివారణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కళాశాల లైబ్రరీలు, తరగతి గదులు, కారిడార్స్, స్టాఫ్ రూమ్‌లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థినులను కౌన్సిలింగ్ నెపంతో తరచుగా పిలుస్తుంటే యాజమాన్యం దృష్టిపెట్టాలన్నారు. నియామకాలు చేసేటప్పుడు నేరప్రవృత్తి, పూర్వాపరాలన్నీ పరిశీలన చేయాలని, అమ్మాయిలకు కౌన్సిలింగ్ ఇచ్చినప్పుడు మహిళా సిబ్బంది కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా కెమిస్ట్రీ, ఫిజిక్స్ వంటి ల్యాబ్‌లలో ప్రాక్టికల్‌వర్క్ నేర్చుకోవడానికి విద్యార్థినులు వెళ్లేటప్పుడు మహిళా సిబ్బంది ఉండాలన్నారు. శారీరక దండన, కార్పొరేట్ కల్చర్ ఎడ్యుకేషన్, పిల్లలందరి ముందు అవహేళన చేయడం వంటివి చేయకూడదని, ర్యాగింగ్ జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుని పిల్లల్లో అవగాహన కల్పించాలన్నారు. వసతిగృహాల్లో వార్డెన్లు తప్పనిసరిగా ఉండాలని, సిబ్బంది, విద్యార్థులు టెర్రస్ పైకి వెళ్లకుండా తాళాలు వేసుకోవాలని, బాలికల వసతిగృహాలకు మహిళా వార్డెన్ ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పు కనిపిస్తే కుటుంబసభ్యులతో మాట్లాడాలన్నారు. క్యాంపస్ కాప్స్, చిన్నారికి చేదోడు కార్యక్రమాల ద్వారా వ్యక్తిగత సమస్యల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌ఐవో పి.దుర్గారావు మాట్లాడుతూ విద్యార్థులకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించి నిత్యం యోగా, ధ్యానం చేయించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్, ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ ఎ.విజయ్‌కుమార్, సీఐలు ఉమామహేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

వీరగున్నమ్మ కీర్తి.. భావి తరానికి స్ఫూర్తి



వీరగున్నమ్మ స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మందస: తెల్లదొరలపై కత్తులు దూసిన వీరగున్నమ్మ కీర్తిని భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మందస మండలంలోని గుడారిరాజమణిపురం(వీరగున్నమ్మపురం) గ్రామానికి చెందిన వీరనారి సాసుమాన గున్నమ్మ 84వ వర్ధంతి వీరగున్నమ్మపురం సమీపంలో గున్నమ్మ స్థూపం, మందసలలో సోమవారం నిర్వహించారు. మందసలోని శ్రీరాజాశ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, మార్పు ట్రస్టు అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు, కిసాన్ కాంగ్రెస్ నాయకుడు కొర్ల హేమారావుచౌదరి, సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఆర్.దిలీప్‌కుమార్, అప్పలస్వామి, కృష్ణ, వల్లభ, చిరంజీవి, మట్ట ధర్మారావు, సవర గురునాథ్, కె.కేశవరావు, పి.దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగనన్నకు, పేటలో దాసన్నకు తిరుగులేదు

- శిష్టకరణ, కళింగవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు కృష్ణ, సాయిప్రసాద్



మాట్లాడుతున్న సదాశివుని కృష్ణ, సాయిప్రసాద్

పోలాకి: రాష్ట్రంలో జగనన్న చరిష్మాకు, నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్(దాసన్న)కు తిరుగులేదని, ఎన్నికల్లో ఇద్దరూ భారీమెజార్టీతో గెలుపొందుతారని రాష్ట్ర శిష్టకరణ, కళింగవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, పాట్నూరు సాయిప్రసాద్ అన్నారు. సోమవారం పోలాకి మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం పోలాకిలో వారు విలేకర్లతో మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతిగా నిలిచిన ధర్మాన కృష్ణదాస్ జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో మళ్లీ గెలుపొందటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వైఎస్సార్‌సీపీలో జరుగుతున్న చేరికలు మరింత ఉత్సాహాన్నిస్తున్నాయని తెలిపారు. జిల్లాలోని అన్ని ఎమ్మెల్యే స్థానాలతో పాటు ఎంపీ స్థానాన్ని సైతం కైవశం చేసుకునే దిశగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం సాగుతోందని చెప్పారు.

యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన



రణస్థలం: ప్రచారం నిలిపివేయిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది



ఎల్.ఎన్.పేట: తీన్మార్ వాయిస్తున్న చిన్నారులు

రణస్థలం: మండలంలోని మహంతిపాలెంలో ఎన్నికల అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ప్రచారం నిర్వహించారు. టీడీపీ విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.ఈశ్వరరావులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా డీజె సౌండ్‌లతో ప్రచారం చేపట్టారు. సమాచారం అందుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ ఎస్.నిర్మల గ్రామానికి చేరుకుని అనుమతులు లేవని చెప్పడంతో కూటమి శ్రేణులు వెనుదిరిగారు.

- **ఎల్.ఎన్.పేట:** పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టి మండలం ముక్తాపురం, చొంపాపురం తదితర గ్రామాల్లో టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం చిన్నారులతో తీన్మార్ ఏర్పాటు చేయడం విమర్శలకు తావిచ్చింది.

గిరిజన కానిస్టేబుల్‌ను దూషించడం సరికాదు



మందస పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గిరిజన నాయకులు

మందస: మండలంలోని బుడారిసింగి పంచాయతీ కళింగదళ్ వద్ద జరిగిన సంఘటనలో ఎస్టీ కానిస్టేబుల్ రవికుమార్‌పై అనుచిత ప్రవర్తన సరికాదని గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు సవర నీలకంఠం అన్నారు. ఈ మేరకు గిరిజనులతో కలిసి సోమవారం మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాటుసారా అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారం మేరకు పోలీసులు వెళ్లారని, వారిని చూసి పారిపోతున్న దేవరాజు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోవడంతో గాయపడ్డారని చెప్పారు. విషయం తెలుసుకోకుండా టీడీపీ నాయకులు కానిస్టేబుల్‌ను కులం పేరుతో నిందించడం అన్యాయమన్నారు. దూషించిన నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మందస మండలంలోని పెడంగో వద్ద జరిగిన సంఘటనలో పోలీసుల ప్రమేయం ఉందో లేదో తెలుసుకోకుండా శిరీషా భూతద్దంలో చూపిస్తున్నారని జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, గిరిజన నాయకులు సవర నీలకంఠం, డొంబురు, చిరంజీవి, కామేషు, సవర ఢిల్లీరావు, బాబురావు, మజ్జి కుమారచంద్ర, నగేశ్, భావన్న, భైరాగి, సవర ఆనంద్, లోకేష్, పెద్ద డొంబురు, పూర్ణ, కూర్మారావు, ఏలియా, సీమోన్, రాము తదితరులు ఆరోపించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనల మేరకు విధులు నిర్వహిస్తున్న ఎస్టీ, ఎస్సీ ఉద్యోగులను నైతికంగా, మానసికంగా దెబ్బ తీస్తున్నారన్నారు. దేవరాజు, పోలీసులకు మధ్య గొడవ జరిగిందనడం వాస్తవం కాదన్నారు. మందస పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు.

ఉప సర్పంచ్‌ను సస్పెండ్ చేసిన వైఎస్సార్ సీపీ

వజ్రపుకొత్తూరు: పూండి–గోవిందపురం ఉప సర్పంచ్ గుంట సత్యంపై వైఎస్సార్‌సీపీ సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు సోమవారం వైఎస్సార్ సీపీ మండల విద్యార్థి విభాగం, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాలిన పాలిన ఉమామహేశ్వరావు, సర్పంచ్ పాలిన రమ్య ప్రకటన విడుదల చేశారు. పార్టీలో ఎంతో ప్రాధాన్యమిచ్చినప్పటికీ ఇటీవల సత్యం వ్యవహార శైలి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుండటంతో సీతంపేట గ్రామస్తుల ఫిర్యాదు మేరకు వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేశామని ఆయన పేర్కొన్నారు.

నగదు, మద్యం స్వాధీనం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూడిలంక జంక్షన్‌లో ఆదివారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.1,02,850 పట్టుబడింది. సంతబొమ్మాళి మండలం కస్పానౌపడకు చెందిన ద్విచక్ర వాహనం నుంచి ఈ నగదు పట్టుకున్నారు. ఆధారాలు చూపకపోవడంతో తహసీల్దార్ సురేష్ ఆధ్వర్యంలో నగదు సీజ్ చేసి శ్రీకాకుళం ట్రెజరీకి తరలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వనిత, వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ సీహెచ్.రామారావు పాల్గొన్నారు.

పోలాకి: మండల కేంద్రం పోలాకిలోని ఆసుపత్రి కూడలిలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.66 వేల నగదు పట్టుబడింది. డీటీ గాయిత్రి ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో నరసన్నపేటకు చెందిన ఓ వ్యాపారి వద్ద ఈ నగదు గుర్తించి సీజ్‌చేశారు. అయితే అన్ని ఆధారాలు ఉన్నా డీటీ పట్టించుకోలేదని నరసన్నపేట అగ్రి ఇన్‌పుట్స్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారుల నగదు లావాదేవీల విషయంలో లోతుగా విచారించి ఆధారాలు చూపించేందుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు.

ఆమదాలవలస: కొత్తవలస జంక్షన్ వద్ద సోమవారం 15 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ డీటీ కె.నీలిమ తెలిపారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని కట్యాచార్యులపేటకు చెందిన మన్నేన తారకేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.